www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

బుధ వారం

08 । జూన్ । 2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-96

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృథ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

### వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై నిషేధం



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** ప్రభుత్వ వైద్యుల విషయంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వైద్యులకు ప్రైవేట్ ప్రాక్టీస్ నిషేధం విధించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఒక జీవో విడుదల చేసింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరే ప్రభుత్వ వైద్యులు.. ఇకపై ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి వీల్లేదు. ఈ మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ సర్వీస్ నిబంధనలను ప్రభుత్వం సవరించింది. రాష్ట్రంలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకోసం కసరత్తు చేపట్టింది. ఈ తరుణంలో నియామక మార్గదర్శకాల్లో ప్రభుత్వ డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీస్ రద్దు అంశం కీలకంగా మారింది ఇప్పుడు. రాష్ట్రంలో మొత్తం 12,755 వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమవగా వాటిలో 10 వేలకుపైగా పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ ఆర్బీ) భర్తీ చేయనుంది. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎం పోస్టులను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు భర్తీ చేయనుండగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను మాత్రం టీఎస్‌పీఎస్సీ భర్తీ చేయనుంది.

## వైఎస్ పాలనను మళ్లీ తెస్తాం

- నిరుద్యోగులకు ఉద్యోగాలు
- పోడు రైతులకు పట్టాలు ఇస్తాం
- ప్రజాప్రస్థానంలో వైఎస్ షర్మిల



**ఖమ్మం, జూన్ 7 (అక్షర వెలుగు):** తాము అధికారంలోకి రాగానే మొట్టమొదటి సంతకం పెట్టేది ఉద్యోగాల భర్తీపైనే అని, రాజశేఖర్ రెడ్డి పాలన మరోసారి ముందుకు తెస్తానని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల హామీనిచ్చారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పారని, ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తానని మాట మరిచారని విమర్శించారు. ఒక్క మాట నిలబెట్టుకోలేదని, ప్రతి వర్గాన్ని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూముల పేరుతోనూ మోసం చేశారన్నారు. వైఎస్ ఉండగా లక్ష ఎకరాలకు పైగా పట్టాలు ఇచ్చారని అన్నారు. కెసిఆర్ ఒక్క ఎకరాకైనా పట్టా ఎందుకు ఇవ్వలేదన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలో 87వ రోజు ప్రజాప్రస్థానం యాత్ర కొనసాగింది. ప్రతి మంగళవారం నిరుద్యోగ నిరాహార దీక్షలో భాగంగా.. లక్ష్మీపురంలో దీక్షకు దిగారు షర్మిల. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ టీఆర్ఎస్ కు ప్రజలు రెండు సార్లు అధికారం ఇస్తే ఏం చేశారని, ఏ బిడ్డలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగం అత్యధికంగా పెరిగినట్లు చెప్పారు. ఉద్యమ సమయంలో గ్రూప్స్ పరీక్షలు రాయొద్దని చెప్పినట్లు.. ఎన్నిసార్లు గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చారని నిలదీశారు.

## విచారణ నెపంతో బాధితునిపై పాశవికంగా దాడి చేసిన పోలీస్



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** చిలకలగూడ పోలీసులు బైక్ పడవేసారని ఫిర్యాదు నెపంతో సూర్య అనే యువకున్ని అమానుషంగా దాడి చేసి కాలు విరగొట్టిన ఉదాంతం హైదరాబాద్ చిలకలగూడా పరిధిలో జరిగింది. సికిందిరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో బాధితుని పరామర్శించి న్యాయము జరిగేలా చూస్తానని భరోసా కల్పించిన ఆప్ పార్టీ సెర్చ్ కమిటీ చైర్ పర్సన్ ఇందిరా శోభన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయాల్సిన పోలీసులు పేదలపై తమ అధికార బలంతో దౌర్జన్యం చేయడం శోచనీయమని, వైపు రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా వరుసగా అత్యాచారాలకు గురి అవుతుంటే పోలీసు వ్యవస్థ ఎమి చేసున్నదని విమర్శించారు. విచారణ నెపంతో పిలిచి బాధితునిపై పాశవికంగా దాడి చేయడము ఏ పోలీసు చట్టం చెప్తుందని తెలంగాణ హోంమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాణహాని ఉన్నదని నేరుగా ఉన్నత అధికారులు కలిసి రక్షణ కల్పించాలని మొరపెట్టుకున్నా ప్రాణాలు కాపాడలేని పోలీసులు ఒక నోరులేని పేద యువకుని మీద తమ ప్రతాపం చూపడం హాస్యాస్పదంగ ఉన్నదని అన్నారు. రాష్ట్రములో ఒకవైపు మాదకద్రవ్యాలు , ఒకవైపు మద్యం ఎరులైపారుతుంటే మరో వైపు చిన్న పెద్ద తేడా లేకుండా మహిళల పైన అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే , బడా బాబులను కాపాడుతూ పెదలపైన దౌర్జన్యం చేయడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుదన్నారు. ప్రభుత్వం వెంటనే బాధితునికి నష్టపరిహారం చెల్లించి ఈ అమానుష దాడికి పాల్పడ్డ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అప్ నేత శ్రీమతి ఇందిరా శోభన్ గారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు , వారి సహాయకులు ఆస్పత్రిలో సరైన సేవలు లేక ప్రతిదానికి ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు, , ప్రసూతి వార్డులో ఒకటే పడక మీద ఇద్దరు ముగ్గరు బాలింతలు ఉండాల్సిన పరిస్థితి ఉండదని, మందులు దొరకక బయటకు అనుకుంటున్నామని, రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి నాలుగైదుసార్లు తిరగాల్సి వస్తుందని మరుగుదొడ్లు లేక స్థానాల గదులు లేక బయట డబ్బులు ఇచ్చి 2

# హైదరాబాద్‌లో హత్యాచార పరంపర

- వెలుగులోకి వస్తున్న రోజుకో దారుణం
- జూబ్లీహిల్స్ ఘటన మరవక ముందే మరో దుస్సంఘటన
- కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై ఐదుగురు అత్యాచారం
- రెండు నెలలుగా సాగుతున్న వ్యవహారం..ఆలస్యంగా వెలుగులోకి
- ఐదుగురిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** హైదరాబాద్‌లో అత్యాచారాల పరంపర కొనసాగుతోంది. రోజుకో దారుణం వెలుగు చూస్తోంది.జూబ్లీహిల్స్‌లో బాలికపై సామూహిక అత్యాచార ఘటన మరవక ముందే సికింద్రాబాద్ పరిధిలో మైనర్‌పై అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్ఖానా పీఎస్ పరిధిలోని లాడ్జిలలో వేర్వేరు రోజుల్లో బాలికపై ఐదుగురు అత్యాచారానికి పాల్పడ్డారు. విచారణ చేపట్టిన పోలీసులు ఐదుగురు నిందితులను, లాడ్జి నిర్వాహకులను అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాలికతో సోషల్ మీడియాలో పరిచయం పెంచుకున్న నిందితులు... మాయమాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్నారు. స్నేహం పేరుతో బాలికను ఆ యువకులు మభ్యపెట్టారు. వేర్వేరు రోజుల్లో ఆ ఐదుగురు లైంగిక వాంఛ తీర్చుకున్నారు. లాడ్జిల్లో వేర్వేరు రోజుల్లో ఆ యువకులు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కార్ఖానా పోలీసులు... దర్యాప్తు చేపట్టారు. బాలిక తండ్రి విజ్ఞప్తి మేరకు గోప్యంగా విచారణ జరిపారు. ఐదుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు మే 30న కేసు నమోదు చేసిన పోలీసులు... అత్యాచారం చేసిన ఐదుగురు యువకులు, ఇద్దరు లాడ్జ్ నిర్వాహకులను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అయితే కార్ఖానా పీఎస్ పరిధిలో జరిగింది గ్యాంగ్ రేప్ కాదని పోలీసులు చెబుతున్నారు. కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికను ఇద్దరు యువకులు ట్రాప్ చేశారని పోలీసులు వెల్లడించారు. ఐదుగురు యువకుల్లో ఇద్దరు మైనర్లున్నారని తెలిపారు. అమ్మాయితో స్నేహంగా ఉంటూనే యువకులు లైంగిక వాంఛ తీర్చుకున్నారన్నారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడింది రెండు వేరు వేరు లాడ్జిల్లోనని కార్ఖానా పోలీసులు గుర్తించారు. ఇద్దరి మైనర్లు, ముగ్గురు మేజర్లతో పాటు ఇద్దరు లాడ్జి నిర్వాహకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎవరికి వారు బాలికను ట్రాప్ చేసి లైంగిక కోరిక తీర్చుకున్నారని పోలీసులు తెలిపారు. ధీరజ్, రితేష్ అనే యువకులతో బాలికకు కొన్ని నెలల క్రితం ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతోనే రోజూ మాట్లాడుతూ బాలికతో చనువు పెంచుకున్నారు. ఈ 2

## పల్లెప్రగతి మన జీవన విధానం కావాలి

- మన గ్రామాలు దేశానికి ఆదర్శంగా నిలవాలి
- ప్రజలంతా భాగస్వాములై విజయవంతంచేయాలి
- జనగామ జిల్లాలో పల్లె ప్రగతికార్యక్రమంలో ఎర్రబెల్లి



**జనగామ, జూన్ 5 (అక్షర వెలుగు):** పల్లె ప్రగతిని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ఒక జీవన విధానంగా చూడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రజలకు పిలుపునిచ్చారు.పల్లె ప్రగతి ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా మన గ్రామాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. మన గ్రామాలను మిగతా రాష్ట్రాలు, దేశం అనుసరిస్తున్నది. పల్లెల అభివృద్ధి వెలుగు విరజిమ్మతూ ఉన్నాయి.ఈ పథకం ఫలితాలు అద్భుతంగా ఉన్నాయి. కేంద్రం అవార్డులు ఇవ్వటమే ఇందుకు నిదర్శనం. ప్రజలంతా భాగస్వాములై, దీనిని విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమాన్ని జీవన విధానంగా అలవాటు చేసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవెన్ను, బమ్మెర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఐదో విడత ప్రగతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కలిసి పారిశుద్ధ్య 2

### ఇది సిగ్గుపడాల్సిన మతోన్మాదం: రాహుల్ ట్వీట్

**న్యూఢిల్లీ, జూన్ 7 (అక్షర వెలుగు):** మహ్మద్ ప్రవక్తపై వ్యాఖ్యల వివాదం పట్ల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. ఇది సిగ్గుపడాల్సినంతటి మతోన్మాదం అని ట్విటర్‌లో పేర్కొన్నారు. 'ఉద్దేశపూర్వకంగానే విభజన రాజకీయాలకు పాల్పడుతున్నారు... కానీ, భారతదేశం బయటి దేశాల్లో బలహీనపడుతోంది. ఇలాంటి సిగ్గుమాలిన మతోన్మాదం మనలను ఏకాకులను చేయడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా భారత్ పరువును కూడా మంటగలుపుతోందని బీజేపీని ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ విమర్శించారు. వివాదంపై.. పలు ప్రతిపక్షాలు బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని టార్గెట్ చేశాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు తెలంగాణ మంత్రి కేటీఆర్, బీఎస్పీ నేత మాయావతి సహా పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

## రఘునందన్ రావు, రాజాసింగ్‌లపై ఫిర్యాదులు

ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై పోలీస్ కేసు

కేసులు కొత్తేమీకాదన్న ఎమ్మెల్యే రఘునందన్



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలపై పోలీసులు కేసు నమోదు చేశారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై అబిడ్స్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ అత్యాచార కేసులో బాలిక ఫొటోలు, వీడియోలు విడుదల చేశారని.... న్యాయవాది ఫిర్యాదు మేరకు రఘునందన్‌రావుపై కేసు దాఖలైంది. రఘునందన్‌రావుపై ఐపీసీ 223(జీ) సెక్షన్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల రఘునందన్‌రావు జుబ్లీహిల్స్ ఘటనకు సంబంధించిన ఆధారాలు కొన్నింటిని మీడియా ముందు బయటపెట్టారు. తమ వద్ద మరిన్ని ఆధారాలు ఉన్నాయని వాటిని పోలీసులకు, న్యాయస్థానానికి అందచేస్తామని తెలిపారు. ఈ క్రమంలోనే బాలిక ఫొటోలు, వీడియోలు విడుదల చేశారు. ఆ ఫొటోల్లో ఉన్నది ఓ ఎమ్మెల్యే కుమారుడు అని రఘునందన్ రావు 2

## తెలంగాణ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

ఓ తీర్పులో జరిమాన చెల్లించకపోడంపై మండిపాటు

రెడు వారాల్లో చెల్లించాలని మరోమారు ఆదేశం

**న్యూఢిల్లీ, జూన్ 7 (అక్షర వెలుగు):** రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులు పాటించలేదని మండిపడింది. ఎస్టీల రిజర్వేషన్ కేసులో జరిమానా చెల్లించక పోవడంపై తెలంగాణ సర్కారును సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులన్నీ ఎస్టీలకే కేటాయిస్తూ గతంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీన్ని సవాలు చేస్తూ సుప్రీంలో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరగ్గా.. ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం తీర్పునిచ్చింది. ఏపీ, తెలంగాణకు రెండున్నర లక్షల చొప్పున సర్వోన్నత న్యాయస్థానం జరిమానా కూడా విధించింది. ఏపీ ప్రభుత్వం ఈ జరిమానాను చెల్లించగా.. తెలంగాణ చెల్లించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం పాటించలేదని సుప్రీంకోర్టు మండిపడింది. దీనిపై స్పందిస్తూ.. పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందునే జరిమానా చెల్లించలేదని 2

# సంపాదకీయం

## పరమత సహనం మన విధానం !

మత విశ్వాసాలను గౌరవించడం అందరి విధి. ఎవరి మత విశ్వాసాలు వారివి. వాటిని గౌరవిస్తూనే సమాజం లో ముందుకు సాగాలి. పరమత సహనం అన్నది మన విధానం. భారతదేశం లౌకిక విధానలే ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయి. దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా ఎవరు ఎవరి మతాలను కించపర్చడం లేదా చులకన చేయడం సరికాదు. మంచీచెడులను వివేచించడం మనపనికాదని గుర్తుంచుకోవాలి. విద్వేష భావనలు సామరస్యపూర్వక సాంఘిక జీవనాన్ని విచ్ఛిన్నం చేస్తాయని గుర్తించాలి. ఎవరు ఏ మాతాన్ని రుద్దడం లేదా, మార్చడం నేరంగా పరిగణించాలి. అలాగే మత విశ్వాసాల జోలికి పోకుండా చూడాలి. ప్రజాస్వామిక లౌకిక విలువలకు భారతీయ జనతా పార్టీలోని ఒకరిద్దరు చేస్తున్న వ్యాఖ్యల వల్ల మొత్తం సమాజమే తలదించుకునే పరిస్థితి రాకూడదు. ఎదుటి వారు అలాంటి పనిచేస్తే విమర్శించాలే తప్ప మనమే అలాంటి పనులకు దిగడం ఎంతవరకు సబబో ఆలోచించాలి. కొందరు నేతలు తూలిన మాటలపై సంజాయి షీ ఇచ్చుకోవాల్సి రాకూడదు. ప్రస్తుత భారతదేశం బహుమతాలతో పెనవేసుకుని ఉంది. బహుభాషలు మాట్లాడే ప్రజలు కలసి జీవిస్తున్నారు. సాంస్కృతిక భిన్నత్వాలను కలిగిన భారతీయ సమాజ బలిమిగా ఉందంటే కారణం అది దేశమంతా ఒక్కటే అన్న భావన మాత్రమే. ఈ ప్రజాస్వామిక లౌకిక విలువలకు ఎవరు కూడా ఆటంకం కలిగించినా అది తీవ్రపరిణామాలకు దారితీస్తుంది. తూలిన మాటలను వెనక్కి తీసుకోలేమని గుర్తించాలి. వేషభాషలు, వ్యక్తిగత విశ్వాసాలు,ఆహారపు అలవాట్లను ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛకు వదిలేయాలి. సామరస్యపూర్వక సాంఘిక జీవనాన్ని కొనసాగించేలా చూడాలి. వేల ఏళ్లుగా భారత్‌లో దాడుల కారణంగా హిందూమతం విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేశారు. అలాగే మతమార్పిడు లతో దాడులు చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లుగా విడివడ్డ తరవాత కూడా హిందువులను ఊచకోతకు గురి చేశారు. ఇప్పటికీ దాడులుచేస్తూనే ఉన్నారు. మొన్నటికిమొన్న దీపావళికి ముందు బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోతను చూశాం. కాశ్మీర్‌లో టెర్రరిస్టుల ముసుగులో మతాంతీకరణకు జరిగిన దురాగతాలను కళ్లారా చూశాం. వీటిపై ఆనాడు మిన్నకున్నా ఇప్పుడు యుద్దం చేయాలి. అలాంటి సందర్భం వదిలి తాజాగా మహ్మద్ ప్రవక్త, ఇస్లామ్‌పై బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలు ఓ రకంగా వారి సంకుచిత భావాలను వెల్లడించేలా ఉన్నాయి. ఇలాంటి వారివల్ల దేశానికి తలవంపులు తెచ్చిపెట్టరాదు. తాలిబన్ల లాగా మనం కూడా విచ్చలవిడిగా ఉంటే మన ఔన్నత్యం దెబ్బతింటుంది. మనం అందుకు భిన్నమని వేల ఏళ్లుగా రుజువు చేస్తూ వచ్చాము. మనపై మతదాడులు జరిగినా సంయమనం పాటించడం వల్లనే భారతదేశ ఔన్నత్యం ప్రపంచానికి తెలిసింది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఖతర్‌లో పర్యటిస్తున్న కీలక సమయంలో ఈ వ్యాఖ్యలపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సి రావడం సరైనదేనా అన్నది ఆలోచించాలి. వ్యూహాత్మక భాగస్వామ్య పక్షాలైన గల్ఫ్ రాజ్యాలతో భారతదేశ బాంధవ్యాలు మోదీ హయాములో ఇంకా బలపడ్డాయి. సంకుచిత ప్రయోజనాలకోసం కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ఎదుటివారి మనోభావాలను దెబ్బతీసేలా ఉండరాదు. ప్రజాస్వామ్య దేశంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఇండియా కీలకపాత్ర పోషించా ల్సి ఉంది. మతపరమైన హింసోన్మాదంపై పోరాడుతున్న మనం అలాంటి చర్యలకు ఒడిగట్టరాదు. భిన్నత్వంలో ఏకత్వమే సహజాభరణమైన భారతావనికి బలంగా నిలిచాయి. అవే మనకు ఆయువుగా ఉన్నాయి. తాజా వివాదం వివిధ రంగాలపై తక్షణ ప్రభావం చూపగలదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముస్లిం మత విశ్వాసాలు ప్రబలంగా ఉండే పశ్చిమాసియా దేశాలు భారతీయ ఉత్పత్తులపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది. మన దేశం నుంచి వెళ్లే కార్మికులకు వీసాల జారీని నియంత్రించడానికి ప్రయత్నించవచ్చు. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)ల నుంచి మన దేశానికి వస్తాయని ఆశిస్తున్న పెట్టుబడుల్లో ఆలస్యం జరగవచ్చు. కశ్మీర్ అంశంలో పాకిస్థాన్ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టడంలో, ఉగ్రవాదులకు సహాయ సహకారాలు అందకుండా నిరోధించడంలో పలు గల్ఫ్ దేశాలు భారత్‌కు సహకరిస్తూ వస్తున్నాయి. మరికొన్ని తటస్థ వైఖరిని కనబరుస్తున్నాయి. కొందరు బిజెపి నేతల తాజా వ్యాఖ్యలతో ఏర్పడిన ప్రతికూల వాతావరణాన్ని ఎంత త్వరగా చక్కదిద్దితే మనదేశానికి అంత మంచిది. పాలకులు ఈ పరిణామంతో ఆత్మరక్షణలో పడవలసి వచ్చింది. పార్టీ పెద్దలకు ఉన్న ఈ నైపుణ్యం నూపుర్, జిందాల్ వంటివారికి ఉండదు కనుక వారు రెచ్చిపోయి, దేశాన్ని ప్రమాదంలో పడేశారు. వీరిద్దరి మాటలు దేశానికి ఆర్థికంగా ఎంత నష్టంచేయబోతున్నాయో రాబోయే రోజుల్లో మరింత స్పష్టంగా తెలుస్తుంది. అమృతోత్సవ భారతం ఎంతో కష్టపడి నిర్మించుకున్న బంధాన్ని ఎంతో సులువుగా కూల్చి వేశారు. పాకిస్థాన్ కు ఎక్కడలేని శక్తి ఇప్పుడు వచ్చింది. ఇంతకాలం దాని చేతికి చిక్కని మత ఆయుధాన్ని ఇప్పుడు నేరుగా అందించింది మనమే. నిప్పుచల్లారకుండా అది తనవంతుగా ఎగవేస్తూనే ఉంటుంది. బీజేపీ ప్రతినిధి తన సుదీర్ఘ ప్రకటనలో అవవసరార్థం అన్నమాటల్లో కొన్నింటినైనా ఆచరణలో చూపకపోతే ఈ అగ్గి చల్లారే అవకాశం లేదు. ఇలాంటి వ్యాఖ్యలుచేసేముందు మనం ఎంత నిగ్రహంగా ఉండాలో ఆలోచించాల్సి ఉంది. మనం ఒక్కరమే ఈ భూమ్మీద జీవింజడం లేదు. ఎందరో మనతోపాటు ఉంటున్నారు. మనమంతా కలసి బతకాల్సిఉంది. ఇవన్నీగమనించిమన ప్రవర్తన ఉండాలి. మన మాటలు ఉండాలి. బిజెపి నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ముస్లిం దేశాలు విరుచుకుపడుతున్నాయి. ఈ వ్యాఖ్యలను ఖండించిన పలు దేశాలు.. బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలిపాయి. సౌదీ సహా పలు అరబ్ దేశాలు చేస్తోన్న వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. మతపరమైన వ్యక్తిత్వాన్ని కించపరిచే అభ్యంతరకర ట్వీట్లు, వ్యాఖ్యలు కొంత మంది మాత్రమే చేస్తారు. అవి ఏవిధంగానూ భారత ప్రభుత్వ అభిప్రాయాలు కావు. మొత్తంగా ఇప్పుడు ఇతరులపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండడం అలవర్చుకోవడం మంచిది. అది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది.మనమంతా ఒక్కటే అని చాటాల్సిఉంది. మతాలతో ప్రజలను విడదీసే సంకుచిత స్వాభావాన్ని వదిలితేనే మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# పట్టణ ప్రగతిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

### తమ వీధులను వారే పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### పట్టణప్రగతిలో పాల్గొన్న మంత్రిపువ్వాడ



**ఖమ్మం, జూన్ 7 (అక్షర వెలుగు):** పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, తమ వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవలని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ప్రజలు సహకరించకపోతే సమస్యలు అలాగే ఉంటాయన్నారు. ప్రజలంతా ఎవరికి వారు తమ వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పట్టణప్రగతి కార్యక్రమంలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని పలు పనులను ప్రారంభించారు. 58వ డివిజన్ వివేకానంద కాలనీలో మురుగును తొలగించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్లో మొక్కలు నాటారు. 55వ డివిజన్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రధాన కాల్వ పూడిక పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాల్వలు పరిశీలించి మురుగు పేరుకుపోయిన ప్రాంతాలను తక్షణెళి శుభ్రం చేయాలని అధికారులను అదేశించారు. 6వ డివిజన్ ఖానాపురం ప్రధాన రహదారిపై గల డివైడర్ పెయింటింగ్, వాల్ పెయింటింగ్, ఖాళీ స్థలాలు శుభ్రం చేసే పనులను ప్రారంభించారు. డివైడర్ కు స్వయంగా కాసేపు మేయర్ నీరజ తో కలిసి రంగులు వేశారు. అనంతరం సెంటర్లో పేరుకుపోయిన చెత్తా చెదారం ను తొలగించి.. ప్రభుత్వ స్థలాల గోడలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడలకు రంగులు వేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ , సుడా చైర్మన్ విజయ్ మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి అసిస్టెంట్ కమిషనర్ మల్లేశ్వరి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ రంగారావు, విద్యుత్ డీఈ రమేష్ కార్పొరేటర్లు దోరెపల్లి శ్వేత , మోతారపు శ్రావణి, నాగండ్ల కోటి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 12న గౌరవెల్లి ట్రయల్ రన్

### హుస్నాబాద్ ప్రాంతం గోదావరి జలాలతో సస్యశ్యామలం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు వెల్లడి

**హుస్నాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** గౌరవెల్లి రిజర్వాయర్ ట్రయల్ రన్‌తో గోదావరి జలాలు హుస్నాబాద్ నియోజక వర్గాన్ని ముద్దాడనున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. 12న గౌరవెల్లి ట్రయల్ రన్ పూర్తయితే.. హుస్నాబాద్ ప్రాంతమంతా గోదావరి జలాలతో సస్య శ్యామలం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పందిళ్ల గ్రామంలో మంగళవారం శ్రీ స్వయం భూరాజేశ్వర ట్రస్టు వాసవీ నిత్యాన్నదాన సత్రాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే ఓడితెల సతీశ్ తో కలసి మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పొట్లపల్లి శ్రీ స్వయం భూ రాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి ముత్రంశెట్టి రాములు తండ్రి పరితపించే వారని, ఆకలి అయిన వారికి అన్నం పెట్టి మంచి పేరు గడించారన్నారు. పది మందికి ఉపయోగకరమైన సేవ చేస్తున్న స్వయంభూ రాజేశ్వర ట్రస్టు వాసవీ నిత్యాన్నదాన సత్రానికి శాశ్వత నిధిలో భాగస్వామిగా తన నెల వేతనాన్ని ట్రస్టుకు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. హుస్నాబాద్‌లో రూ.10 కోట్లతో 50 పడకల మాతా, శిశు సంక్షేమ దవాఖానను ఏర్పాటు చేస్తామన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గం లోని అన్ని తండాలకు త్వరలోనే రోడ్లు మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకుండా మిల్లర్లపై రైడింగ్ పేరిట వేధింపులకు గురి చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు ఇబ్బందులు కలగకుండా వడ్లు కొనుగోళ్లు పూర్తి చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బండి సంజయ్ ఒకవైపు, రేవంత్ రెడ్డి మరోవైపు పాదయాత్రలు చేయడం విడ్డూరం గా ఉందన్నారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏఎన్ఎం సబ్ సెంటర్లను పల్లె దవాఖానలుగా త్వరలో అప్ గ్రేడ్ చేస్తామన్నారు.



# వైఎస్ పాలనను మళ్లీ తెస్తాం

(మొదటి పేజీ తరువాయి..) ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కూలి పనికి పోతున్నారని, కేజీ టూ పీజీ ఉచిత విద్య అని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. విద్యార్థులకు స్కాలర్ షిప్స్ లేవు... ఫీజు రీయంబర్స్ మెంట్ అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే... బిడ్డలను చదివించడం తప్పు చేశామని తల్లి దండ్రులు బాధ పడుతున్నారని వెల్లడించారు. ఉద్యోగాలు రాకపోవడంతో ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. ఒక్క రోజు కూడా ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను పరామర్శించలేదని పేర్కొన్నారు. దీనికంతటికీ కారణం కేసీఆర్ అని ఆరోపించారు. పార్టీ పెట్టకముందే నిరుద్యోగులకోసం మూడు రోజులు దీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారామె. లక్షా 91 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే.. 10, 15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తారా అంటూ ఎద్దేవా చేశారు. లక్షా 91 వేల ఉద్యోగాలు కాకుండా...మొత్తం 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. 3 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తెలంగాణ లో ఎన్ని సార్లు గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చారు..? రాష్ట్రంలో ఒక్క కుటుంబానికి అండగా నిలిచారా ? అని ప్రశ్నించారు. వైఎస్ హాయాంలో ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు ఉచితంగా వచ్చాయని.. ప్రస్తుతం ఇవన్నీ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. ఉద్యోగాలు వచ్చేంత వరకు పోరాటం చేస్తామని, తాము పోరాటం చేసిన అనంతరం ప్రభుత్వానికి బుద్ధి వచ్చిందన్నారు. అందుకనే ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ ఇస్తున్నారని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి సంక్షేమ పాలన తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని, మూడుసార్లు జాబ్ నోటిఫికేషన్ ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వైరా నైట్ క్యాంప్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ గండగుల మీదుగా.. లక్ష్మీపురం గామానికి చేరుకున్నారు. అక్కడ నిరుద్యోగ నిరాహార దీక్ష చేపట్టారు. సాయంత్రం దీక్షను విరమించారు. నిరుద్యోగుల తరపున 26 వారాలుగా నిరాహార దీక్ష చేస్తున్నారు షర్మిల. ఖాళీగా ఉన్న లక్షా 90 వేల ఉద్యోగాలకు పూర్తి స్థాయిలో నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లక్ష్మీపురం గ్రామంలోనే రాత్రి బస చేయనున్నారు.

# పల్లెప్రగతి మన జీవన విధానం కావాలి

(మొదటి పేజీ తరువాయి..) కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం సిసి రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ... గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించడం, ఆయన వారసులుగా చెప్పుకునే వాళ్లకు సాధ్యం కాలేదని, అలాగే ఆ తర్వాత పరిపాలన చేసిన ఎవ్వరికీ చేత కాలేదని అన్నారు. తెలంగాణ తెచ్చిన గాంధీజీలా సీఎం కేసిఆర్ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ, దేశానికి ఆదర్శంగా నిలిచిన అనేక కొత్త పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. అందులో ఒకటి ప్లలె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలని అన్నారు. తన రాజకీయ జీవితంలో కూడా ప్లలె ప్రగతి వంటి పథకాలను, అవి సాధించిన ఫలితాలను చూడలేదన్నారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ, అభివృద్ధిని గ్రామాలకు పట్టం కడుతూ, సీఎం చేపట్టిన ప్లలె ప్రగతి వల్ల మన గ్రామాల రూపు రేఖలే మారాయని చెప్పారు. ప్లలె ప్రగతి తో పారిశుద్ధ్యం పెరిగింది, విష జ్వరాలు దూరమయ్యాయి. అంటురోగాలు మాయమయ్యాయి. ఆరోగ్యాలు మెరుగు పడ్డాయి.కనీస సౌకర్యాలు పెరిగి, గ్రామాలు అభివృద్ధి చెందాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి అని మంత్రి వివరించారు. గ్రామాల్లో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ట్రాలీలు, మంచి నీటికి ట్యాంకర్లు, డంపింగ్ యార్డు లు, చెత్తను వేరు చేసే పరిస్థితులు, తద్వారా ఆదాయం పొందే మార్గాలు, కళ్లా లు, రైతు వేదికలు, స్మశాన వాటిక లు వరకు అన్ని సరిగ్గా అమరయాయని మంత్రి వివరించారు.నేనూ మిషన్ భగీరథ నీటినే తాగుతా...46 వేల కోట్లతో గోదావరి జలాలను ఇంటింటికి తాగునీరు గా అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ నీటిని త్రాగాలని తాను కూడా భగీరథ నీటిని తాగుతున్నాను అన్నారు. వైకుంఠధామం అన్ని సౌకర్యాలు కల్పించాలని తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటు న్న0దున ప్రజలు భాగస్వామ్యం అందించాలని విజ్ఞప్తి చేశారు ప్రతి ఇల్లు తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలని చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని అన్నారు.

# విచారణ నెపంతో బాధితునిపై పాశవికంగా దాడి చేసిన పోలీస్

(మొదటి పేజీ తరువాయి..) కాలకృత్యాలకు స్థానాలు చేయాల్సి వస్తుందని తెలిపారు, రోగుల సహాయకులకు ఉండటానికి సరిపోను ఏర్పాట్లు లేవని ఇవిగాక అయినదానికి కానిదానికి ఆస్పత్రి సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని రోగుల సహాయకులు వాపోయారు, గాంధీ ఆసుపత్రి మన రాష్ట్రంలో పెద్ద ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రం నలుమూలల నుండి రోగులు చికిత్స కోసం వస్తారు రాజధాని నగరంలో ఉన్న గాంధీ గాంధీ ఆసుపత్రి లో పరిస్థితి ఈ విధంగా ఉంటే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు కాటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆప్ నేత విమర్శించారు, మన దగ్గర ఆస్పత్రులు ఇలా అధ్వానంగా పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఢిల్లీ వెళ్లి అక్కడి ప్రభుత్వ ఆస్పత్రులను చాలా బాగున్నాయి అని మెచ్చుకోవడం హర్షించదగ్గ విషయం అయితే అది మన రాష్ట్రంలో కూడా ఆసుపత్రులపై శ్రద్ధ పెట్టి అలాంటి సేవలు తెలంగాణ ప్రజలకు అండించాలని ఆమ్ ఆద్మీ పార్టీ పార్టీ హెచ్ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి ఇందిరా శోభన్ గారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సికంద్రబాద్ నాయకుల శాహదత్ ఖాన్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రఘునందన్ రావు, రాజాసింగ్‌లపై ఫిర్యాదులు

(మొదటి పేజీ తరువాయి..) ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఓ న్యాయవాది ఫిర్యాదు మేరకు అబిడ్స్ పీఎస్‌లో రఘునందన్‌రావుపై కేసు నమోదు అయింది. మరోవైపు సాముహిక అత్యాచార బాధితురాలికి సంబంధించిన వివరాలను రిలీజ్ చేసిన ఓ జర్నలిస్టు సుభాన్‌పైన పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ అమ్నీషియా పబ్ సామూహిక లైంగికదాడి ఘటనలో బాలిక ఫోటోలు, వీడియోలను రఘునందన్ రావు బీజేపీ ఆఫీసులో విడుదల చేశారు. దీంతో ఆయనపై ఐపీసీ సెక్షన్ 228ఏ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.అలాగే గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అజ్మీర్ దర్గాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న స్థానికుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు యూట్యూబ్‌లో వైరల్ అయ్యాయి. ఈ వీడియో ఆధారంగా రాజాసింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 295ఏ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ... తనకు కేసులు కొత్త కాదని అన్నారు. పోలీసుల నోటీసుల కోసం బీజేపీ కార్యాలయంలో సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, ఎంఐఎం కలసి రాజకీయంగా నాటకాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. ఇదే మెదటి.. చివరి ఎఫ్ఐఆర్ కాదని, ఉద్యమంలో పోరాడిన వాడినని తెలిపారు. చట్టం తెలిసిన వాడిగా సాక్ష్యాలను మాత్రమే బయట పెట్టినట్లు తెలిపారు. కేసులను ఎదుర్కోవడానికి సిద్దంగా ఉన్నానన్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి..) ధర్మాసనానికి తెలంగాణ ప్రభుత్వం సమాధానమిచ్చింది. జరిమానా చెల్లించేందుకు ప్రభుత్వానికి ధర్మాసనం మరో 2 వారాలు గడువు ఇచ్చింది. జరిమానా చెల్లించకుంటే కోర్టు ధిక్కరణ పక్రియ చేపడతామని హెచ్చరించింది. అన్నిచోట్ల రిజర్వేషన్లు రాజ్యాంగానికి లోబడి ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది.

# హైదరాబాద్‌లో హత్యాచార పరంపర

క్రమంలోనే రెండు (మొదటి పేజీ తరువాయి..) నెలల క్రితం ఒక రోజు హోటల్ గదికి రప్పించి బాలికపై వీరిద్దరూ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆ సమయంలో వీడియోలుతీసి.. బెదిరిస్తూ రెండు నెలలుగా ఆమెపై అత్యాచారం జరుపుతూ నరకం చూపిస్తున్నారు. ఇక ఇటీవల ఆ వీడియోలు ఇచ్చేస్తాం రమ్మని నమ్మబలికి మరోసారి లాడ్జ్‌కి పిలిచి తన మిత్రులతో సైతం బాలికపై ధీరజ్ రేప్ చేయించాడు. రెండు నెలలుగా బాధితురాలు ఈ విషయాల గురించి ఎవరికీ చెప్పలేదు. కానీ మానసికంగా కృంగిపోతుండటంతో తల్లిదండ్రులు ఆమెను సైక్రియాటిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళారు. తనపై రెండు నెలలుగా జరుగుతున్న అత్యాచారానికి సంబంధించిన అన్ని విషయాలను ఆమె సైక్రియాటిస్ట్ వద్ద వెల్లడించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు మే 30న కార్ఖానా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఓ మైనర్‌తోపాటు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

# వేగంగా సమీకృత మార్కెట్ల నిర్మాణం

### నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవు

### అధికారులతో సమీక్షించిన మంత్రి గంగుల

**కరీంనగర్, జూన్ 7 (అక్షర వెలుగు):** సమీకృత మార్కెట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గుత్తేదారులు సమీకృత మార్కెట్లను వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఐలాండ్ ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల వద్ద పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో, చొప్పదండి, జమ్మికుంట, హుజరాబాద్, కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఏఈలతో సమీకృత మార్కెట్ల నిర్మాణం, ఫుట్ పాత్‌ల ఆక్రమణలు, హరితహారం, ఐలాండ్, రానున్న వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్, జమ్మికుంట హుజరాబాద్, చొప్పదండి,కొత్తపల్లి పట్టణాలలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణాలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్ష కాలంలో మురికినీరు, కాలువల నీరు బీటీ రోడ్లపై ప్రవహించడం వల్ల రోడ్లు పాడై పోతున్నాయన్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలన్నారు. కరీంనగర్, సిరిసిల్ల రోడ్డును రూ.80 కోట్ల తో పూర్తి చేస్తున్నామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కరీంనగర్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించేలా ఎన్టీఆర్ విగ్రహం నుంచి కమాన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు మెయిన్ ఎంట్రన్స్ అద్భుతంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలన్నారు. వైకుంఠధామంలను జిల్లాలో వందశాతం పూర్తి చేయాలని మంత్రి అన్నారు. సమావేశంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ , నగర మేయర్ వై సునీల్ రావు, జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్, అదనపు కలెక్టర్ అగర్వాల్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, తదితరులు పాల్గొన్నారు.



# 5న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం



**అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు**

**అధికారులతో సమీక్షించిన మంత్రి తలసాని**

**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణాన్ని జులై 5 వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. అమ్మవారి కళ్యాణానికి నగరం నుండే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని పేర్కొన్నారు. వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కళ్యాణం నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4వ తేదీన ఎదుర్కోళ్ళు, 5వ తేదీన కళ్యాణం, 6వ తేదీన రథోత్సవం నిర్వహించ నున్నట్టు వివరించారు. అమ్మవారి కళ్యాణాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ÷ఎ లలో చూసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో అమ్మవారి కళ్యాణం, బోనాలు, ఇతర అన్నివర్గాల పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి తోపులాటలకు అవకాశం లేకుండా పటిష్టమైన భారికేడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. భారీ పోలీసు బందోబస్తు తో పాటు అఅ కెమెరాలను ఏర్పాటు చేసి శాంతిభద్రతల ను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఆలయ పరిసరాలలో ఎక్కడ కూడా సీవరేజి లీకేజీలు లేకుండా పర్యవేక్షించాలని వాటర్ వర్క్స్ అధికారులను మంత్రి ఆదేశించారు. రహదారుల మరమ్మతులు ఉంటే ఇప్పటినుండే చేపట్టాలని చెప్పారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా విద్యుత్ లైన్ లను సరిచేయడం, చెట్ల కొమ్మలను తొలగించడం చేపట్టాలని అన్నారు. అమ్మవారి దర్శనం, కళ్యాణం కోసం ఇచ్చే పాస్ లను డూప్లికేషన్ కు ఆస్కారం లేకుండా బార్ కోడింగ్ తో కూడిన పాస్ లను జారీ చేయాలని ఆదేశించారు. కళ్యాణం, రథోత్సవం సందర్భంగా ఆలయం వైపు రహదారులను మూసివేసి వాహనాల మళ్లింపుకు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్, పోలీసు అధికారులను ఆదేశించారు. దేవాలయ పరిసరాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సాంస్కృతిక శాఖ ఆద్వర్యంలో కళాకారులతో భక్తులను ఆహ్లాద పరిచేలా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపుతుందని చెప్పారు. అమ్మవారి కళ్యాణం తర్వాత ఆలయ అభివృద్ధి కోసం సహకరించిన దాతలు, కళ్యాణం ఏర్పాట్లను పర్యవేక్షించిన వివిధ శాఖల అధికారులను సన్మానిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఇక్ష అన్నపూర్ణ, ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**వారిపై బైండోవర్ కేసులు: సీపీ**



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పోలీసు అధికారులను ఆదేశించారు. సైబరాబాద్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారితో సమావేశం ఏర్పాటు చేసి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగినది. కమిషనరేట్ పరిధిలో కొంతమంది పాత నేరస్తులు హత్యలు తదితర కేసులలో ఉన్నటువంటి వారిని సత్ప్రవర్తనతో మెలుగుటకు,ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకుండా ఉండుటకై స్టీఫెన్ రవీంద్ర వారిపై విచారణ జరిపి ఆ వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలుగుట కొరకు హామీ ఇవ్వాల్సిందిగా ఉత్తర్వులను జారీ చేయడమైనది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇద్దరు జమీనుదారులతో 50 వేల రూపాయల హామీ బాండ్ ఇచ్చుటకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమైనట్లయితే ఒక సంవత్సర కాలం జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సయ్యద్ ఇమ్రాన్, సయ్యద్ రషీద్, మహమ్మద్ గతంలో ఒక హత్యకేసులో రాజేంద్రనగర్ పరిసర ప్రాంతంలో ప్రజలకు శాంతి భద్రతలకు భంగం కలిగించారు. అదే పోలీస్ స్టేషన్ పరిధిలో రాంలాల్ శంకర్ లాల్ పరదేశి, మొహమ్మద్ షాబాజ్ ఖాన్లు కుల్సుంపుర , పహడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో ఉండి ప్రస్తుతం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నారు. అలాగే సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొహమ్మద్ ఆసిఫ్, మహమ్మద్ గౌస్, జగద్గిరిగుట్ట స్టేషన్ పరిధిలో అలిగా నరేష్, శామీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నక్క నరేష్ మొదలగు వీరందరిపై శాంతి,సత్ప్రవర్తనతో ఒక సంవత్సర కాలం నిలుపుట కొరకు ప్రతి వ్యక్తికి 50 వేల రూపాయల హామీ బాండ్ తీసుకోవడం జరిగినది. ఈ సంవత్సర కాలం పాటు ఇలాంటి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడరాదని ఉత్తర్వులు జారీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్ సింగన్వర్, ఏసీపీ రవిచంద్ర, ఇన్ స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై ఆరా

**పట్టణ ప్రగతిలో పాల్గొన్న మంత్రి పువ్వాడ**



**ఖమ్మం, జూన్ 7 (అక్షర వెలుగు):** తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలపై పట్టణ ప్రజలను మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని పలు పనులను ప్రారంభించారు. 58వ డివిజన్ వివేకానంద కాలనీలో మురుగును తొలగించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్లో మొక్కలు నాటారు. 55వ డివిజన్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రధాన కాల్వ పూడిక పనులు ప్రారంభించారు. అనంతరం డివిజన్‌లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాల్వలు పరిశీలించి మురుగు పేరుకుపోయిన ప్రాంతాలను తక్షణెళి శుభ్రం చేయాలని అధికారులను అదేశించారు. 6వ డివిజన్ ఖానాపురం ప్రధాన రహదారిపై గల డివైడర్ పెయింటింగ్, వాల్ పెయింటింగ్, ఖాళీ స్థలాలు శుభ్రం చేసే పనులను ప్రారంభించారు. డివైడర్ కు స్వయంగా కాసేపు మేయర్ నీరజ తో కలిసి రంగులు వేశారు. అనంతరం సెంటర్లో పేరుకుపోయిన చెత్తా చెదారం ను తొలగించి.. ప్రభుత్వ స్థలాల గోడలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడలకు రంగులు వేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ , సుడా చైర్మన్ విజయ్ మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి అసిస్టెంట్ కమిషనర్ మల్లేశ్వరి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, డీఈ రంగారావు, విద్యుత్ డీఈ రమేష్ కార్పొరేటర్లు దోరెపల్లి శ్వేత , మోతారపు శ్రావణి, నాగండ్ల కోటి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఫోర్త్‌వేవ్ తప్పదంటున్న నిపుణులు

**అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు**



**న్యూఢిల్లీ, జూన్ 7 (అక్షర వెలుగు):** కరోనా వేవ్ వస్తోందంటే జనం భయపడే రోజులివి.. కానీ థర్డ్ వేవ్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో ఫోర్త్ వేవ్‌ను అందరూ లైట్ తీసుకునే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఫోర్త్ వేవ్ వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే పెనుముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు. రెండున్నరేళ్ల క్రితం కరోనా మహమ్మారి ఇంటి నుంచి కాలు బయట పెట్టనీయలేదు. ప్రాణభయం వెంటాడడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. జీవన ప్రయాణానికి లాక్ పడింది. క్రమంగా కరోనా ప్రభావం పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో రెండున్నరేళ్ల తర్వాత జనజీవనం పట్టాలపై పరుగులు తీస్తోంది. మళ్లీ పూర్వ వైభవం వచ్చిందా అన్నట్లుగా అంతటా రద్దీ వాతావరణం నెలకొంది. ఉత్సవాలు, పెళ్లిళ్లు, వేడుకలు, జాతరలు జనంతో కలకలలాడుతున్నాయి. ప్రస్తుతం మళ్లీ ఫోర్త్ వేవ్ భయం ఆందోళన కలిగిస్తోంది. జూన్ 22 నుంచి అక్టోబర్ 24 వరకు అంటే నాలుగు నెలలపాటు ఫోర్త్ వేవ్ ప్రభావం ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.కాన్పూర్ ఐఐటీకి చెందిన పరిశోధకులు ఫోర్త్ వేవ్‌పై కీలక విషయం వెల్లడించారు. అయితే దీని తీవ్రతపై మాత్రం వారు క్లారిటీ ఇవ్వలేకపోతున్నారు. కొత్త వేరియంట్లు, మ్యూటేషన్లు, వ్యాక్సిన్లు, బూస్టర్ డోసుల ప్రభావం ఆధారంగా ఫోర్త్ వేవ్ ప్రభావం ఎలా ఉందో అంచనా వేయొచ్చు. బూస్టర్ డోసు వల్ల కలిగే ఇమ్యూనిటీ నిలబడగలితే పోర్ వేవ్ ప్రభావం కూడా పెద్దగా ఉండకపోవచ్చు. ఇమ్యూటీని మించి మ్యూటేషన్ ఇబ్బంది పెడితే మాత్రం ఫోర్త్ వేవ్ ప్రభావం గట్టిగా ఉంటుంది. దేశవ్యాప్తంగా కరోనా ఫోర్త్ వేవ్ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత రెండు వారాలుగా దేశవ్యాప్తంగా, ఇటు తెలంగాణ రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్నాయి. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలో రెండు, మూడు జిల్లాల్లో కరోనా కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది. కేంద్రం అప్రమత్తం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, మహరాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఉన్నాయి. గత రెండు వారాలుగా యాక్టివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం తెలంగాణలో 6 వందల యాక్టివ్ కేసులు ఉన్నాయి. పూర్తిగా సాధారణ పరిస్థితులు నెలకొనడం, మాస్క్, సామాజిక దూరం పాటించకపోవడం.. కరోనా కేసులు పెరగడానికి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించి, సామాజిక దూరం పాటించాలని తెలంగాణ ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# తెలంగాణ తెచ్చుకున్నది పబ్ కల్చర్ కోసమేనా

**హైదరాబాద్‌లో ఘటనలు ఆందోళనకరం**

**టిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జీవన్ రెడ్డి**



**జగిత్యాల, జూన్ 5 (అక్షర వెలుగు):** పబ్ కల్చర్‌తో అనర్ధాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. పబ్ కల్చర్ కోసమే తెలంగాణా తెచ్చుకున్న కేటీఆర్ చెప్పిన అభివృద్ధి ఇదేనా? అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అదుపులో లేవని జీవన్ రెడ్డి మండిపడ్డారు. గంజాయి, బెల్టుషాపులు లేని ఊరే లేదని అంటూ టీఆర్ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు. పబ్ కల్చర్ కొరకే తెలంగాణా సాధించుకున్నామా ? ఇదేనా కేటీఆర్ చెప్పిన అభివృద్ధి అంటూ ప్రశ్నించారు తెలంగాణ రాష్ట్రంలో అక్రమ మద్యాన్ని ప్రభుత్వం పోత్సాహిస్తోందని, బెల్టు షాపులతో ప్రభుత్వ ఆదాయం అమాంతం పెరిగిపోతోందన్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఆబ్కారీ శాఖలు దాడులు చేయడం లేదని విమర్శించారు. మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విచ్చలవిడి మద్యంతో కనీస విలువలు లేకుండా పోతున్నాయని, పబ్ కల్చర్‌తో ఎన్నో అనర్దాలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్ లో శాంతి భద్రతలు లేకపోవడంతో పెట్టుబడులు రావడం లేవన్నారు. రూ. 32 వేల కోట్లు కేవలం ఆబ్కారీ ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని, మద్యాన్ని ప్రోత్సాహించడం ద్వారా.. 90 శాతం ప్రమాదాలు జరుగుతునట్లు తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ లతో కూడా ఆదాయం సమకూరుతోందని, అక్రమ మద్యాన్ని ప్రోత్సాహిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. గంజాయి, బెల్టు షాపులు లేని ఊరు లేదని, మద్యపాన నిషేదంతోనే ఫ్లలె ప్రగతి సాధిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు.. జగిత్యాలలో ఇసుక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. నిర్మాణ రంగంలో ఇసుకను అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, కానీ..అలా జరగడం లేదన్నారు. ఇసుక దొరక్క పోవడంతో జగిత్యాల జిల్లాలో నిర్మాణాలు ఆగిపోయినట్లు, ఇల్లు కట్టుకోవడానికి సామాన్య ప్రజలు ట్రాక్టర్ లలో ఇసుకను తీసుకెళుతుంటే.. పోలీసులు అడ్డుకోవడం శోచనీయమన్నారు.

# రాష్ట్రపతి ఎన్నికల్లో కెసిఆర్ వ్యూహం ఏమిటో?

**ఉమ్మడి అభ్యర్థిపై విపక్షాలు కలసి వచ్చేనా**

**ఎన్‌డిఎకు వ్యతిరేకంగా బరిలో నిలిచేదెవరో**



**హైదరాబాద్, జూన్ 7 (అక్షర వెలుగు):** రాష్ట్రపతి ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ కెసిఆర్ ఎలాంటి వ్యూహం అనుసరిస్తారన్నది ఇప్పుడు సర్వత్రాచర్చగగా మారింది. గుణాత్మకరాకీయాల పేరుతో మోడీకి వ్యతిరేకంగగా కాళ్లకు గజ్జెలు కట్టి తిరుగుతున్న కెసిఆర్ మదిలో ఎవరున్నారన్నది కూడా తెలియడం లేదు. అలాగే కెసిఆర్‌తో చర్చించిలేదాప్రాంతీయపార్టీలు అన్నీ కూర్చుని చర్చించే అవకావం కూడా కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ రాజకీయాలపై కెసిఆర్ పలువురు నేతలతో చర్చించినా రాష్ట్రపతి విషయంలో మళ్లీ చర్చించాల్సి ఉంది. ఈ క్రమంలో కెసిఆర్ వ్యూహం ఏమిటన్నది చూడాలి. మరోవైపు దేశంలో రాజకీయాలు వేడెక్కాయి. బిజెపికి వ్యతిరేకంగా కెసిఆర్ ఇప్పటికే పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ఇప్పటినుంచే పావులు కదుపుతున్నారు. ఇప్పటి వరకు జాతీయ రాజకీయాల్లో బిజెపి దూకుడును అడ్డుకునే మొనగాడే లేకుండా పోయాడు. అలాగే మోడీ నిర్ణయాలను నిగ్గదీయగలిగిన దీటైన నేత కూడా లేకుండా పోయాడు. అనేకానేక అంశాలపై సాధికారికంగా మాట్లాడే నేత లేడన్న భావనలో ప్రజలు ఉన్నారు. ప్రాంతీయ పార్టీల నేతల్లో కెసిఆర్ ఒక్కరే సరైన లేదా బలమైననేతగా ఉన్నారు. ఆయనకు జాతీయ రాజకీయాలతో పాటు,రాజ్యాంగం, అంతర్జాతీయ వ్యవహారాలు కొట్టిన పిండి. బిజెపికి కూడా చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ లేదు. జగన్, స్టాలిన్,మమతా బెనర్జీ, పట్నాయక్ వంటి వారెవరూ మోడీని ఢీకొనే సత్తా లేదని తేలింది. ఈ క్రమంలో మోడీని ఢీకొనేందుకు రెడీ అవుతున్న కెసిఆర్ గట్టిగా పోరాడుతారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. కేంద్రంతో పోరాడేందుకు ఆయన అడుగు వేసినా ఇతర ప్రాంతీయపార్టీల నేతలు మద్దతు ఇస్తారా అన్నది కూడా అనుమానమే. గత సార్వత్రిక ఎన్నికలకు ముందే కెసిఆర్ ఓ ప్రయోగం చేసినా అడుగు ముందుకు పడలేదు. మోడీ మరో మారు భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో పాటు..తెలంగాణలో కూడా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకుంది. కాంగ్రెస్ మరో మూడు సీట్లు గెల్చుకుంది. దీంతో కెసిఆర్ కూడా వెనక్కి తగ్గారు. ఇకపోతే కేవలం సెంటిమెంటంతోనే పోదామంటే కెసిఆర్‌కు కూడా కాలం కలసి రాకపోవచ్చు. ఈ క్రమంలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి ప్రతిపాదనపై కసరత్తుచేయాల్సి ఉంది. దేశంలో ఇప్పుడున్న రాజకీయ నేతల్లో కెసిఆర్‌కున్న రాజకీయ నిబద్ధత, అవగాహన మరెవరికీ లేదు. అలాగే ఆయన భారత రాజకీయాలు, ప్రపంచరాజకీయాలను బాగా ఔపోసన పట్టారు. అందుకే కెసిఆర్ కూడా జాతీయ రాజకీయాల్లోకి ఎంటర్ అయ్యేందుకు రంగం సిద్దం చేసుకుంటు న్నట్లుగా కనిపిస్తోంది. కెసిఆర్ ఇటీవల వేస్తున్న అడుగులు రాబోయే రోజుల్లో జరిగే మార్పును సూచిస్తున్నది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన జాతీయరాజకీయాల్లోకి రానున్నారన్న సూచనలు వస్తున్నాయి. రాజ్యసభలో ఉంటూ జాతీయ రాజకీయాలను తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు వ్యూహం పన్నడం ఖాయంగా కనిపిస్తోంది. మోడీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక అంశాలను ముందుకు వేసుకుని.. నిలదీసే నేత కావాలి. అలా చేయడంలో ఇప్పుడున్న నేతలు సరిపోరు. అలాగే ఇప్పటికే తెలంగాణలో ప్రవేశ పెట్టిన అనేక పథకాలు దేశ్యాప్తంగా అమలుచేస్తే దేశ దరిద్రం పోతుందన్న భావన కెసిఆర్‌లో బలంగా నాటుకుంది. ఇక రాష్ట్రంలోనూ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. గత ఎన్నికల్లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మార్పులు.. చేర్పులూ టిఆర్ఎస్‌లో చోటుచేసుకుంటున్నాయని వినికిడి..! జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించే దిశగా అడుగులేస్తోన్న సిఎం కెసిఆర్.. దేశాన్ని గాడిలో పెట్టేలా ప్రజలు తనను ఆశీర్వదించాలంటూ... పదేపదే కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపిగా బరిలోకి దిగడం ద్వారా లోక్‌సబలో ప్రవేశించాలని చూస్తున్నట్లుగా కూడా ప్రచారం అవుతోంది. ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరిని బరిలో దింపుతారఅనే అంశాలపై చర్చలు సాగుతున్నాయి. రానున్న ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయకుండా ఎంపిగా పోటీ చేస్తే పరిణామాలు మారుతాయి. అయితే మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపిగా బరిలోకి దిగుతారనే పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కొంతకాలంగా... కెసిఆర్ ఈసారి నియోజకవర్గం మారవచ్చని ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం పేరు కూడా వినిపించింది. ప్రస్తుతం మెదక్ నుంచి టిఆర్ఎస్ ఎంపిగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి ఈసారి లోక్‌సభకు కాకుండా.. దుబ్బాక నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తారన్న ప్రచారం కూడా... కెసిఆర్ పార్లమెంటుకు వెళతారన్న అభిప్రాయాలకు బలాన్ని చేకూరుస్తోంది. మొత్తంగా కెసిఆర్ భారీప్రణాళికతనే ఉన్నారని తెలుస్తోంది. ఈక్రమంలో రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఎలాముందదుకు సాగుతారన్నది చూడాలి.




# చలన చిత్రం

## మరో బాలీవుడ్ సినిమాలో ప్రభాస్

### పూర్తి కావస్తున్న ఆదిపురుష్ ప్రాజెక్ట్ పనులు



గ్లోబల్ స్టార్ ప్రభాస్ మరో బాలీవుడ్ సినిమాలో నటించడానికి రంగం సిద్ధమవుతుందనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం డార్లింగ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సలార్ అనే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను చేస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా శృతి హాసన్ నటిస్తోంది. అలాగే, సమాంతరంగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక 50వ చిత్రం ప్రాజెక్ట్ కె షూటింగ్‌లో కూడా పాల్గొంటున్నారు. ఇక హిందీలో ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న స్ట్రెయిట్ మూవీ ఆదిపురుష్ వీఎఫెక్స్ వర్క్‌ను జరుపుకుంటోంది.అయితే, బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సిద్దార్థ్ ఆనంద్ దర్శకత్వంలో ప్రభాస్ ఓ భారీ చిత్రాన్ని చేయబోతున్నారట. ఈ చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ హిందీలో స్ట్రైట్ ప్రాజెక్ట్‌గా నిర్మించబోతున్నట్టు సమాచారం. ప్రస్తుతం సెట్స్‌పై ఉన్న సినిమాలు కాకుండా మారుతి దర్శకత్వంలో ఓ సినిమాను చేయనున్న ప్రభాస్, 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో 'స్పిరిట్' అనే సినిమాను చేయాల్సి ఉంది. వీటిలో మారుతి సినిమా ఇదే ఏడాది, సందీప్ రెడ్డి వంగ సినిమా వచ్చే ఏడాది సెట్స్‌పైకి వస్తాయని వార్తలు వస్తున్నాయి.ఎంతలేదన్నా ఈ సినిమాలలో ప్రభాస్ తన పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేయడానికి ఏడాదిన్నర పడుతుందట. ఇక సిద్దార్థ్ ఆనంద్ కూడా షారుఖ్ ఖాన్ హీరోగా సినిమా చేస్తున్నారు. ఈ సినిమాను 2023లో రిలీజ్ చేయబోతున్నారు. దాని తర్వాత ప్రభాస్ హీరో ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టాలని ఎలాన్ చేస్తున్నారట. ఇప్పటికే స్టోరీ లైన్ కూడా సిద్దంగా ఉందని బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు మొత్తం బాలీవుడ్ టెక్నీషియన్స్ వర్క్ చేయబోతున్నట్టు సమాచారం.

## రితేష్ రానాతో లావణ్యత్రిపాఠి చిత్రం

విభిన్న కథలను ఎంచుకుంటూ తన అందం, అభినయంతో టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక లావణ్య త్రిపాఠి. 'అందాల రాక్షసి' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ మొదటి సినిమాతోనే ప్రేక్షకుల చూపును తన వైపు తిప్పుకుంది. ఈ చిత్రం తర్వాత అవకాశాలు క్యూ కట్టాయి. సినిమాల ఫలితం ఎలా ఉన్నా ప్రేక్షకులను అలరించడంలో మాత్రం లావణ్య ఎప్పుడు ముందుంటుంది. ప్రస్తుతం ఈమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'హ్యాపీ బర్త్‌డే'. 'మత్తు వదలరా' వంటి బ్లాక్ బస్టర్ సినిమాను తెరకెక్కించిన రితేష్ రానా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.ఇటీవలే విడుదలైన పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ క్రమంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. 'ఆయుధాల చట్టం అంటే ఏంటి సుయోధన.. ఇంటింటికి గన్, ఎదురులేని ఫన్' అంటూ టీజర్ మొదలైంది. నేను టెన్త్ ఫేయిల్ అయ్యిండొచ్చు కానీ.. గన్‌బిల్ మాత్రం పాస్ చేసే తీరుతా' అంటూ వెన్నెల కిషోర్ చెప్పే డైలాగ్ హృద్యంగా ఉంది. ఆయుధాల చట్టం కోసం పోరాడుతున్న మంత్రిగా కిషోర్ పాత్ర ఉండనున్నట్లు తెలుస్తుంది. 'దేశం నలుమూలలా అంబరాన్నంటిన సంబురాలు. గల్లీ గల్లీకి ఏర్పడిన గన్ బజార్ అంటూ' వచ్చిన డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. చివర్లో 'అసలు మీకు ఈ ఆలోచన ఎలా వచ్చింది అని వెన్నెల కిషోర్‌ను అడుగుతుంటే.. నాకు ఈ ఆలోచన ఎందుకు వచ్చింది అనే అడిగే బదులు.. మీకెందుకు రాలేదని సిగ్గుపడండి' అంటూ కిషోర్ పలికే సంభాషణ నవ్వులు పూయిస్తుంది. టీజర్‌ను గమనిస్తే అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉండబోతుందని తెలుస్తుంది. కాల భైరవ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. సురేష్ సరంగం కెమెరా విజువల్స్ బాగున్నాయి. వివేక్ అగస్త్య కీలక పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు నిర్మించాయి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రం జూలై 15న విడుదల కానుంది.



నెల్సన్‌తో తలైవా సినిమా

## స్వయంగా కథ అల్లుతున్న రజనీ

సూపర్ స్టార్ రజనీకాంత్ పేరు తెలియని సినీప్రేక్షకుడు ఉండడేమో. సౌత్ నుంచి నార్త్ వరకు సినీ ప్రముఖులు సైతం ఈయనకు వీరాభిమానులే. అయితే గత కొంత కాలంగా రజనీకాంత్ నుంచి అభిమానులు ఆశించిన స్థాయిలో ఒక్క సినిమా కూడా రాలేదు. నిజానికి 'రోబో' తరువాత ఇప్పటివరకు రజనీకి ఆ స్థాయి హిట్ లేదు. మధ్యలో భారి అంచనాలతో విడుదలైన 'కబాలి' ప్రేక్షకులను తీవ్రంగా నిరాశపరిచింది. అయితే 2019లో వచ్చిన 'పేట' మాత్రం మంచి విజయం సాధించింది. కానీ అభిమానులకు మాత్రం ఫుల్ మీల్స్ పెట్టలేకపోయింది. ఇక దీని తర్వాత వచ్చి న 'దర్బార్', 'పెద్దన్న' సినిమాలు పరాజయాలుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం రజనీ హిట్ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలోనే నెల్సన్‌తో చేతులు కలిపాడు. 'డాక్టర్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన నెల్సన్.. బీస్ట్ వంటి భారీ ఫ్లాప్ కూడా ఇచ్చాడు. అయినప్పటికి రజనీకాంత్, నెల్సన్‌తో సినిమా చేయడానికి ఒప్పుకున్నాడు. అయితే ఈ చిత్రానికి రజినీ స్వయంగా కథను అందిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. అనిరుధ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ఐశ్వర్యరాయ్, రమ్య కృష్ణ, ప్రియాంక అరుళ్ మోహన్, శివరాజ్‌కుమార్ వంటి అగ్ర తారలు నటించనున్నట్లు టాక్. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రం జూలైలో షూటింగ్ మొదలు పెట్టనుంది.

## 9న మహాబలిపురంలో మా పెళ్లి

### నయన్‌తో పెళ్లిపై విఘ్నేశ్ శివన్




సౌత్ ఇండస్ట్రీలో లేడీ సూపర్‌స్టార్‌గా కీర్తి గడించింది నయనతార. ఆమె ప్రముఖ డైరెక్టర్ విఘ్నేష్ శివన్‌తో వివాహ బంధంతో ఒక్కటి కానున్నారన్న వార్తలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన నయన్-విఘ్నేష్ జంట వారి వివాహ ఆహ్వాన పత్రికను అందజేసిన విషయం తెలిసిందే. దీంతో వారి పెళ్లి ఖరారు అయిందని కన్ఫర్మ్ చేసుకుంది సినీ లోకం. కానీ వీరి ఇద్దరి నుంచి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. తాజాగా వీరి వివాహంపై స్పందించాడు విఘ్నేష్ శివన్. 'నా ప్రేయసి? నయనతారను పెళ్లిని చేసుకోబోతున్నాను. జూన్ 9 గురువారం నేను, నయనతార మహాబలిపురంలో పెళ్లి చేసుకోబోతున్నాం. మా ఇరువురి కుటుంబాలతో పాటు సన్నిహితులు, స్నేహితులు మాత్రమే మా వివాహానికి హాజరు కానున్నారు. నిజానికి ముందుగా తిరుపతిలో పెళ్లి చేసుకోవాలనుకున్నాం కానీ అక్కడ ప్రయాణపరంగా కొన్ని సమస్యలు ఉంటాయని పించడంతో మా వివాహ వేదికను మహాబలిపురానికి మార్చాం. జూన్ 9న ఉదయం పెళ్లి జరుగుతుంది. వాటికి సంబంధించిన ఫొటోలను మధ్యాహ్నం షేర్ చేస్తాం. జూన్ 11న నేను, నయన్ మీ అందరినీ ప్రత్యేకంగా కలుస్తాం. ఇప్పుడు వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా మీ అందరి ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నాను' అని తెలిపాడు విఘ్నేష్ శివన్.



## కెమెరా ముందుకు వచ్చేందుకు రెడీ: కాజల్

దక్షిణాదిన దాదాపు ప్దదెనిమిదేళ్ళుగా కథానాయికగా సత్తాచాటుతోంది అందాల కాజల్ అగర్వాల్ ఆకర్షించే అందం, ఆకట్టుకొనే అభినయం అమ్మడి ప్రత్యేకతలు. తెలుగు, తమిళ భాషల్లో దాదాపు అగ్ర కథానాయకులందరి సరసన నటించిన మెప్పించిన ఈ సుందరి ఇప్పటికీ ఇంకా టాప్ లీడ్ లోనే హవా కొనసాగిస్తోంది. రెండేళ్ళక్రితం బాయ్ ఫ్రెండ్ గౌతమ్ కిచ్లూని పెళ్ళాడిన కాజల్.. ఈ ఏడాది ఏప్రిల్లో పండంటి మగపిల్లవాడికి జన్మనిచ్చింది. ప్రస్తుతం కాజల్, గౌతమ్ దంపతులు తమ జీవితంలోని మూడో వ్యక్తి రాకకు ఆనంద పరవశులవుతున్నారు. కథానాయికగా స్థిరపడిన పలువురు ముద్దుగుమ్మలు వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన తర్వాత తిరిగి సినిమాలవైపుకు రాలేదు. కానీ కాజల్ అగర్వాల్ మాత్రం అలా అనుకోవడం లేదు. వివాహం అనేది జీవితంలో ఒక మధురఘట్టం. పెళ్ళైనంత మాత్రాన సినిమాలు చేయకూడదనే రూల్ ఎక్కడా లేదు కదా.. ఈ విషయంలో గౌతమ్ కిచ్లూ నుంచి ఆమెకు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తమవ్వలేదు. బాలీవుడ్ ముద్దుగుమ్మలు కరీనా దీపికా ప్రియాంకా చోప్రా, ఆలియా భట్ లాంటి వారు పెళ్ళయిన తర్వాత కూడా వరుస సినిమాల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే.. సమంత సైతం పెళ్ళయ్యాకా, చైతూ తో విడిపోయాకా కూడా సినిమాల్లో నటించడం మానలేదు. ఈ క్రమంలో కాజల్ అగర్వాల్ సైతం తిరిగి తెరపైకి వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటోందని టాక్. ఇప్పటికే కాజల్ మేనేజర్, ఏజెంట్స్ ఆమె రీఎంట్రీకి సరిపడే సరైన కథకోసం చూస్తున్నారట. అలాగే.. వెబ్ సిరీస్ లో నటించడానికి కూడా మంచి కథలు కోసం చూస్తున్నట్టు టాక్స్ వినిపిస్తున్నాయి. ప్రెగ్నెన్సీ టైమ్‌లో కాస్తంత లావుగా మారిన కాజల్.. ప్రస్తుతం తన శరీరాన్ని తిరిగి యథా స్థానంలోకి తీసుకురావడానికి కసరత్తులు చేస్తున్నట్టు తెలుస్తోంది. వీలైనంత త్వరగా వెయిట్ లాస్ అయి .. సినిమాల్లో నటించాలని చూస్తోందట. పలువురు దర్శక నిర్మాతలు కాజల్‌తో సినిమాలు చేసేందుకు ఎదురు చూస్తున్నట్టు వినికిడి. మరి కాజల్ ఎప్పుడు మళ్ళీ కెమెరా ముందుకొచ్చి.. అభిమానుల్ని అలరిస్తుందో చూడాలి.



## మురారి బావా పాట విడుదల

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా పరశురామ్ దర్శకత్వంలో నటించిన చిత్రం 'సర్కారు వారి పాట'. ఈ మూవీ ఇటీవలే ప్రక్షకుల ముందుకు వచ్చింది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుని పోతుంది. ఈ సినిమాకు తమన్ అందించిన మ్యూజిక్ హైలెట్ గా నిలిచింది. అన్ని పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి.. అందులో 'కళావతి' .. 'మ మ మహేశా' సాంగ్స్ ట్రెండ్‌లో నిలిచాయి. ఇక మూవీలో 'మురారివా' అనే పాటను అనుకోని కారణాల వల్ల సినిమాలో పెట్టలేదు. అయితే మూవీ రిలీజైన తర్వాత కొద్ది రోజులకు ఈ పాటను యాడ్ చేశారు. తాజాగా ఈ సాంగ్ ను యూ ట్యూబ్ లో విడుదల చేసింది చిత్ర బృందం. 'మురారివా.. మురారివా.. మురళీ వాయిస్తూ ముడేస్తివా' అంటూ ఈ సాంగ్ ఆకట్టుకుంటోంది.మహేశ్, కీర్తిలపై బ్యూటిఫుల్ సెట్లో ఈ పాటను ఎంతో అందంగా షూట్ చేశారు.

## మాజీ భార్యపై గెలుపుతో జానీ డెప్ సెటబ్రేషన్స్

మాజీ భార్య అంబర్ హెర్డ్‌పై కేసు గెలిచిన ఆనందాన్ని ఫుల్ గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాడు జానీ డెప్. ఇంగ్లండ్‌లోనే ఉంటున్న జానీ డెప్.. బర్మింగ్‌హామ్‌లో ఉన్న వారణాసి రెస్టారెంట్‌లో తన ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చారు. భారతీయ రుచులతో కూడిన డిన్నర్ కోసం జానీ డెప్ సుమారు 48.1 లక్షలు ఖర్చు చేశారు. ఇటీవల పరువునష్టం కేసులో వర్జీనియా కోర్టు జానీడెప్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఫ్రెండ్స్‌కు ఇచ్చిన పార్టీలో భారతీయ వంటకాలను జానీ డెప్ ప్రిఫర్ చేశారు. వారణాసి రెస్టారెంట్‌లో కాక్‌టెయిల్స్, రోజ్ చాంపేన్‌తోనూ పార్టీ జరుపుకున్నారు. బర్మింగ్‌హామ్‌లోనే వారణాసి రెస్టారెంట్ అతిపెద్ద ఇండియన్ హోటల్. ఆ రెస్టారెంట్‌లో సుమారు 400 మంది కూర్చునే వీలుంటుంది. ఆదివారం రోజున ఈ డిన్నర్ వేడుక జరిగినట్లు వారణాసి రెస్టారెంట్ ఆపరేషన్స్ డైరెక్టర్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు.



## రాజేంద్రప్రసాద్ అనుకోని ప్రయాణం



ఆపిల్ క్రియేషన్స్ బ్యానర్ పై డా.జగన్ మోహన్ డి.వై నిర్మాతగా వెంకటేష్ పెదిరెడ్ల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అనుకోని ప్రయాణం'. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్, నరసింహ రాజు ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని బెక్కం వేణుగోపాల్ సమర్పణలో విడుదలకు సిద్దమైంది. వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి పరుచూరి బ్రదర్స్ డైలాగ్ అందించడం మరో విశేషం.'నలభై ఏళ్ళ సినీ ప్రయాణంలో ఆ నలుగురు, మీ శ్రేయోభిలాషి లాంటి కొన్ని కథలు విన్నప్పుడు షాకైనమాటే వాస్తవమే. కానీ దర్శకుడు వెంకటేష్ 'అనుకోని ప్రయాణం' కథ చెప్పినపుడు ఫ్రీజ్ అయ్యాను. 45ఏళ్ళ తర్వాత మళ్ళీ గొప్ప సినిమా చేస్తున్నాననే భావన కలిగింది. కరోనా సమయంలో వలస కూలీలు ప్రయాణం నుండి పుట్టిన కథ ఇది. ప్రేక్షకుల మనసుని ఆకట్టుకునే గొప్ప కథ. జగన్ మోహన్ లవ్లీ ప్రొడ్యుసర్. ఇలాంటి సినిమా తీయడం నిర్మాత ప్యాషన్ వల్లే సాధ్యమౌతుంది. సినిమా కథని ప్రేమించిన నిర్మాత. 'అనుకోని ప్రయాణం' లో ఇద్దరి స్నేహితుల కథ. ఇందులో గ్రేట్ ఫ్రండ్షిప్ చూస్తారు. నరసింహరాజు గారు లాంటి గొప్ప నటుడితో కలసి పని చేయడం చాలా ఆనందంగా వుందన్నాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com